మధ్యాహ్నం.. నిర్మానుష్యం

- మండుతున్న ఎండలు
- మధ్యాహ్న సమయంలో తగ్గిన రాకపోకలు

ప్రకాశం నగర్: ఎండలు మండుతున్నాయి. మార్చి చివరిలోనే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఏప్రిల్ ప్రారంభమైన నేపథ్యంలో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉంది. ఎండలు పెరగడంతో జనం ఇళ్లకు పరిమితమవుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో నగరంలోని ప్రధాన ప్రాంతాలు జనం సంచారం లేకుండా నిర్మానుష్యంగా మారుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో వాహనాల రాకపోకలు తగ్గాయి. నిత్యం రద్దీగా ఉండే వై.జంక్షన్, హైటెక్ బస్టాండ్, నందం గనిరాజు జంక్షన్, దానవాయిపేట ప్రాంతాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఏప్రిల్ మొదటిలోనే ఉష్ణోగ్రతలు ఈస్థాయిలో నమోదు కావడంతో.. ఇకముందు ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వివిధ పనులపై బయట తిరిగేవారు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాటన్, లేత రంగు దుస్తులు ధరించడంతో పాటు, విటమిన్ ఏ, సీ ఉంటే ఆహార పదార్థాలు అధికంగా తీసుకోవాలన్నారు. రోజుకు 4 నుంచి 5 లీటర్ల నీరు తాగాలని సూచిస్తున్నారు.



ఎండ కారణంగా శుక్రవారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారిన వై.జంక్షన్

చలివేంద్రాల ఏర్పాటు

ఎండలు పెరగడంతో నగరంలో పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు ఆటో యూనియన్లు, కార్మిక సంఘాలు, వ్యాపార సంస్థలు పెద్ద ఎత్తున రోడ్ల పక్కన, ప్రధాన సెంటర్లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు, మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. వీటితో పాటు జనం కూల్ డ్రింక్‌లు, సోడాలు, పలు రకాల పండ్ల జ్యూస్‌లను తాగేందుకు ఆసక్తి చూపడంతో శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. విక్రయాలు పెరగడంతో ఆయా వ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో సుమారు 2 వేలకు పైగా పాన్‌షాపులు ఉండగా, వేసవి కాలంలో వివిధ రకాల కూల్‌డ్రింక్‌లతో పాటు సోడాలు, బటర్ మిల్క్, లస్సీ వంటి శీతల పానీయాల అమ్మకాలు బాగా జరుగుతాయి. గతంతో పోల్చితే ఇప్పుడు శీతల పానీయాల విక్రయాలు తగ్గాయని, ప్రజలు కొబ్బరి నీళ్లు, చెరుకు రసం తదితర వాటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు

డ్రింక్‌ల విక్రయాలు తగ్గాయి

సాధారణంగా వేసవి సీజన్‌లో వివిధ రకాల కూల్‌డ్రింక్‌లు, సోడాలు తదితర వాటి విక్రయాలు బాగా ఉండేవి. ప్రస్తుతం కొబ్బరినీరు, ఫ్యూర్ జ్యూస్‌ల పేరుతో లీటర్, అర లీటర్ సీసాలను మార్కెట్‌లోకి వచ్చాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు కూల్ డ్రింక్‌ల వ్యాపారం తగ్గింది. సహజ పానీయాలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

– ఎ.వెంకట రమణ, వ్యాపారి



నగరంలోని జ్యూస్‌షాపు

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న జక్కంపూడి రాజా

సీటీఆర్ఐ: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శుక్రవారం స్థానిక వై.జంక్షన్ వద్ద నాళం అప్పలరాజు పెట్రోలు బంకు, వీరాంజనేయ ఆటోస్టాండ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. 15 ఏళ్లుగా వేసవిలో నిర్విరామంగా చలివేంద్రం నిర్వహిస్తున్న వీరాంజనేయ ఆటోస్టాండ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు అడపా వెంకట రమణ, వైకేఎల్, లంక సత్యనారాయణ, బొంత శ్రీహరి, అడపా అనిల్, కోడి కోట, ఆటోస్టాండ్ ప్రెసిడెంట్ ఉమా, సెక్రటరీ కోటి పాల్గొన్నారు.

2న పుస్తకావిష్కరణ

సీటీఆర్ఐ: విశ్రాంత కళాశాల ప్రిన్సిపల్, ప్రముఖ రచయిత్రి డాక్టర్ (మేజర్) చల్లా సత్యవాణి రచించిన ప్రత్యక్ష ఆలయదర్శిని – సీతా రామాంజనేయ ఆలయాలు పుస్తకావిష్కరణ ఆదివారం ఉదయం 10 గంటలకు దానవాయిపేట ప్రణవకుటి కార్యాలయంలో జరుగుతుందని రచయిత్రి సత్యవాణి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్రపతి పురస్కార గ్రహీత విశ్వనాథ గోపాలకృష్ణ గౌరవాధ్యక్షత వహించే ఈ కార్యక్రమంలో రచయిత, పాత్రికేయుడు వారణాసి సుబ్రహ్మణ్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని, చిలకమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి పెరుమాళ్ల రఘునాథ్ సభాసంచాలకత్వం వహించనున్నారన్నారు. సాహితీ అభిమానులు తరలిరావాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



శాటిలైట్ సిటీలో మహిళల సమస్యలను వింటున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆయన శుక్రవారం హుకుంపేట డిబ్లాక్, శాటిలైట్‌సిటీ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. హుకుంపేట డిబ్లాకులో ముస్లింలు మసీదు నిర్మాణానికి అర్జీ పెట్టగా, అందుకోసం స్థలం సేకరించి, నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని చందన అధికారులను ఆదేశించారు. అలాగే వాంబేకాలనీ సమీపంలో డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తానన్నారు. శాటిలైట్ సిటి బి,సి బ్లాకుల్లో ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానన్నారు. రుడా ఆధ్వర్యంలో త్వరలోనే పిల్లల పార్కు నిర్మాణం చేపడతామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న మేకల విమలరావును పరామర్శించారు.

వసతిగృహం కొనసాగించాలి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆల్కాట్‌గార్డెన్స్ శ్రీసత్యసాయి గురుకులంలో వసతి గృహాన్ని కొనసాగించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆందోళన చేశారు. గురుకులంలోని విద్యావిధానానికి ప్రభావితమై దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తమ పిల్లల్ని ఇక్కడ చేర్పించామన్నారు. కోవిడ్ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం ప్రస్తుత విద్యాసంవత్సరానికి ముందుగానే వసతిగృహాన్ని మూసివేస్తున్నట్లు తమకు తెలియజేశారన్నారు. తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని హాస్టల్ కొనసాగించాలన్నారు. దీనిపై గురుకులం కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఎ.శ్యాంసుందర్, కె.గుర్రయ్య మాట్లాడుతూ ఏడాది ప్రారంభంలోనే సెంట్రల్ ట్రస్ట్ ఆదేశాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశామన్నారు. 9, 10 తరగతుల విద్యార్థులు వసతి గృహంలోనే ఉంటారన్నారు. మిగిలిన తరగతులకు వసతి గృహం అందుబాటులో లేనప్పటికీ పాఠశాలలో విద్యార్థులను కొనసాగిస్తున్నామన్నారు.

పార్కువద్ద వ్యక్తి మృతదేహం

కంబాలచెరువు: గోదావరి ఒడ్డున స్థానిక పీవీ నర్సింహారావు పార్కు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని శుక్రవారం కనుగొన్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడు వయస్సు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల సేవ కోసం ట్రస్టు ఏర్పాటు

రాజమహేంద్రవరం సిటీ: అట్టడుగు వర్గాలకు సేవ చేయాలన్న సంకల్పంతో పేబ్యాక్‌టు సొసైటీ అనే నినాదంతో నేషనల్ అప్రెస్డ్ క్లాసెస్ ట్రస్ట్ స్థాపించినట్లు వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ తెలిపారు. స్థానిక ఆనంద్ రీజెన్సీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రస్ట్ విధివిధానాలు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నామని తమకు ఒక్క ఫోన్ కాల్ చేస్తే, వారికి చేతనైనంత సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారులు

రాజమహేంద్రవరం సిటీ: శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతంపేట రామాలయం వద్ద ఏర్పాటు చేసిన శాస్త్రీయ నృత్యోత్సవం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. నాట్యాచార్యులు తణుకు సాయిమాధవి శిష్య బృందం దీనిని ప్రదర్శించింది.

గోశాల నిర్మాణం పరిశీలన

కడియం: స్థానిక భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గోశాల నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు) శుక్రవారం గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మే 5 నుంచి గోశాల ప్రజలకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఆలయ ప్రాంగణంలో గోశాల నిర్మాణ ఆవశ్యకతను పేపరు మిల్లు యాజమాన్యానికి వివరించిన వెంటనే నిధులు మంజూరు చేశారన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆర్‌ఎస్ఎస్ మూర్తి, నాయకులు కొత్తూరి బాల నాగేశ్వరరావు, బొమ్మిరెడ్డి వెంకట్రావు, చిక్కాల నాగేశ్వరరావు, లావేటి రమేష్, గెద్దాటి విఘ్నేష్ పాల్గొన్నారు.

మహిళా చైతన్యంతోనే సమాజాభివృద్ధి

- ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళల్లో చైతన్యం ముఖ్యమని, వారు ఆర్థికంగా స్వశక్తిపై ఆధారపడినప్పుడే సమాజం అన్ని రకాలుగా ప్రగతి పథంలో పయనిస్తుందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సీటీఆర్ఐ సమీపంలోని పనసచెట్టు సెంటర్‌లో 48, 49 డివిజన్లు, ట్రైనింగ్ కాలేజీ ఆవరణలో 25, 28, 29 డివిజన్లకు చెందిన వైఎస్సార్ ఆసరా లబ్ధిదారులతో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి జగన్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సంక్షేమ పథకాలలో అగ్రభాగం మహిళలకే దక్కేలా జగనన్న ఆయా పథకాలను తీర్చిదిద్దారన్నారు. గత నాలుగేళ్లలో నగరాన్ని అభివృద్ధి చేసిన తీరును ఈ సందర్భంగా వివరించారు. మరో ఆరు నెలల్లో నగర రూపురేఖలు సమూలంగా మారిపోతాయన్నారు. ఇంత అభివృద్ధి జరగడానికి కారణం మన రాజమహేంద్రవరంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న అభిమానమన్నారు. రానున్న ఎన్నికలలో రాజమహేంద్రవరం ఎంపీ, ఎమ్మెల్యేలుగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలిచేలా మహిళలు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వైఎస్సార్ ఆసరా పథకం నమూనా చెక్కును మహిళా లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, క్లస్టర్ ఇన్‌చార్జులు పోలు విజయలక్ష్మి, కొత్త విజయ రాజ్యలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జులు బర్రే కొండబాబు, అజ్జరపు వాసు, బిల్డర్ చిన్నా, అడపా రఘు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్

అధికారుల నిర్లక్ష్యంతో ఎండుతున్న చేలు



ఎండిపోతున్న వరిచేనును పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు స్టాలిన్

కడియం: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జేగురుపాడు పరిధిలో వరిచేలు ఎండిపోతున్నాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన నీటిఎద్దడికి లోనవుతున్న వరిచేలను స్థానికులతో కలిసి పరిశీలించారు. పైడిముక్కల వీరరాఘవులు తదితర రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ 20 రోజులుగా పనిచేయడం లేదన్నారు. దీనిపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. వరిపాలు పోసుకునే సమయంలో నీటి ఎద్దడి ఏర్పడితే పంట దిగుబడి దెబ్బతింటుందని రైతులు వివరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ విద్యుత్‌శాఖ ఏఈ తీరు పెద్దలతో ఒక రకంగా, సామాన్య రైతులతో మరో రకంగా ఉంటోందని ఆరోపించారు. దీనిని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకుళతామన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ ఆకుల సుధాకర్, నాగిరెడ్డి మోహనరావు, దేవస్థానం చైర్మన్ పేపకాయల సత్యనారాయణ, రంకిరెడ్డి వీరకృష్ణ, రైతులు పైడిముక్కల రఘు, సత్యనారాయణ, వెలుపల్లి శ్రీను సత్యనారాయణ, పుట్టా రామచంద్రరావు ఉన్నారు. కాగా.. రైతుల ఆరోపణలపై కడియం విద్యుత్‌శాఖ ఏఈ రామారావును వివరణ కోరగా రైతులు తమ ఇబ్బందిని ఈనెల 29వ తేదీన తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే అక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం మార్పించి, విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్టు తెలిపారు. తాను నిబంధనల ప్రకారమే పనిచేస్తున్నానన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే జగన్ లక్ష్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. వైఎస్సార్‌టీయూసీ నాయకుడు ఎన్వీ శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో పీటీడీ వైఎస్సార్ రాజమహేంద్రవరం ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే సీఎం జగన్.. ఆర్టీసీ కార్మికులను ఉద్యోగులుగా చేశారన్నారు. ఆయన మాట ఇస్తే దాన్ని అమలు చేయడమే తప్ప.. మడమ తిప్పడం, అవసరం తీరాక ముఖం చాటేయడం ఉండదన్నారు. మన రాజమహేంద్రవరంలో మొత్తం 532 మంది ఉద్యోగులు ఉన్నారని, వీరంతా రకరకాల సంఘాలుగా కాకుండా ఒకే సంఘంలా ఐక్యంగా ఉండేలా కృషి చేస్తానన్నారు. సమస్యలు ఏమున్నా తన దృష్టికి తీసుకు వస్తే న్యాయపరమైన వాటిని తప్పనిసరిగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధిపై పలువురు ఎంపీ దృష్టికి తీసుకురాగా.. వాటిని లిఖితపూర్వకంగా తెలియజేస్తే పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకుంటానన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పీటీడీ వైఎస్సార్ ఈఎస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వర్రే శ్రీనివాసరావు, రీజినల్ కార్యదర్శులు ఇషాక్, మోహనరావు, పీవీజీ రావు, రాజమహేంద్రవరం శాఖ అధ్యక్షుడు రాయుడు గోపాలకృష్ణ పాల్గొన్నారు.



ఎంపీ భరత్‌రామ్‌తో అసోసియేషన్ సభ్యులు

హుకుంపేట సొసైటీ లాభం రూ.41.39 లక్షలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట ప్రాథమిక సహకార పరపతి సంఘానికి (సొసైటీ) 2021–22లో రూ.41.39 లక్షల లాభం వచ్చిందని సొసైటీ చైర్‌పర్సన్ బొప్పన సుబ్బారావు తెలిపారు. హుకుంపేట సొసైటీ కార్యాలయం సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం మహాజన సభ జరిగింది. బొప్పన సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రుణాలు రూ.752.05 లక్షలు, వ్యవసాయేతర రుణాలు రూ.1085.78 లక్షలు, దీర్ఘకాలిక రుణాలు రూ.459.16 లక్షలు, బంగారురుణాలు రూ.303.96 లక్షలు, గ్రూపు రుణాలు రూ.23.50 లక్షలు ఇచ్చామన్నారు. సంఘం వ్యాపారం రూ.40.12 కోట్లు ఉందన్నారు. 2023–24 అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. సంఘ సభ్యులు చీరా రాజు, ఏలూరి లోకేష్, సీఈవో బొడ్డేటి రాంబాబు, మాజీ సొసైటీ అధ్యక్షులు దుద్దుపూడి సత్యనారాయణ, వల్లేపల్లి కృష్ణమూర్తి, బొప్పన బుల్లిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వ్యవసాయ ప్రదర్శన



వ్యవసాయ ప్రదర్శనను తిలకిస్తున్న డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతిబింబించేలా నమూనాలు ఉన్నాయని జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు అన్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవాశిబిరంలో భాగంగా శుక్రవారం తొర్రేడు సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనను ఆయన, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్యాంరాజ్ నాయక్ ప్రారంభించారు. వ్యవసాయంలో వచ్చిన మార్పులను వివిధ నమూనాల ద్వారా విద్యార్థులు ప్రదర్శించారు. అనంతరం సొసైటీ సమావేశ మందిరంలో రైతు సదస్సు, ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ముగింపు సమావేశం జరిగింది. శిబిరంలో విద్యార్థులు అందించిన సేవలను ఆకుల వీర్రాజు, డాక్టర్ శ్యాంరాజ్ నాయక్ అభినందించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శర్మ, డాక్టర్ బాలాజీ.. రైతులకు పలు సూచనలు అందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ హైమజ్యోతి, డాక్టర్ కె.రవికుమార్ వారం రోజుల పాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ సేవాశిబిరం గురించి వివరించారు. కార్యక్రమంలో తొర్రేడు సొసైటీ అధ్యక్షుడు చిట్టూరి వెంకటరావు, సభ్యుడు దండమూడి అర్జునరావు, సీఈవో కేవీవీ సత్యనారాయణ, వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ పి.అమ్మాజీ పాల్గొన్నారు.


బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జీయూవీబీ రాజు విజయం సాధించారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో శుక్రవారం ఈ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. బార్ అసోసియేషన్‌లో 15 పదవులకు గాను ఏడు పోస్టులకు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన ఎనిమిది పదవులకు ఎన్నికలు నిర్వహించారు. ప్రెసిడెంట్ జీయూవీబీ రాజు 59 ఓట్లు, వైస్ ప్రెసిడెంట్ గేదెల వెంకటేశ్వరరావు 30 ఓట్లు, లేడీ రిప్రజెంటేటివ్ కె.వెంకటలక్ష్మి 259 ఓట్లు, అబౌ టెన్ ఇయర్స్ లేడీ మెంబర్ ఎండీ హసీనా బేగం 80 ఓట్లు, జాయింట్ సెక్రటరీ రామారావు చౌదరి 73 ఓట్లు, లైబ్రరీ సెక్రటరీ మేక శ్రీనివాసరావు70 ఓట్లు, సుమన్ పాల్ 186 ఓట్లు మెజార్టీతో గెలుపొందారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మెంబర్‌గా కేవీ ప్రసాద్, ట్రెజరర్‌గా ఎంవీ దుర్గాప్రసాద్, అబౌ 30 మెంబర్‌గా వెంకటపతిరాజు, జనరల్ సెక్రటరీగా కవి హనుమంతరావు, గుమ్మడి దేవి భవాని, 5 –10 మెంబర్ పోనిపిరెడ్డి తాతారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

క్రమశిక్షణ, పట్టుదలతో విజయం సాధ్యం



కలెక్టర్ మాధవీలతను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ వాణికుమారి, ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యం సాధిస్తారని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల 25వ వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మహిళలు అన్నిరంగాలలోను ముందంజలో ఉన్నారన్నారు. గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఏ.వాణికుమారి ముందుగా పాఠశాల ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కె.జ్యోతి, గురుకుల పాఠశాల జిల్లా కోఆర్డినేటర్ ఏ.మురళీకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ, విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ సూర్యారావు పాల్గొన్నారు.

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

కడియం: మండల పరిధిలో ఏప్రిల్ 3 నుంచి ప్రారంభయ్యే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల విద్యాశాఖాధికారి వి.లజపతిరాయ్ అన్నారు. మండల పరిధిలోని ఆరు పరీక్షా కేంద్రాల్లో 993 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. వీరిలో 573 మంది బాలురు, 480 మంది బాలికలు ఉన్నారని వివరించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో పూర్తిస్థాయిలో విద్యుత్, ఫర్నీచర్, తాగునీరు, మరుగుదొడ్లను అందుబాటులో ఉంచామన్నారు. కడియపులంక పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సిబ్బందితో సహా ఎవ్వరినీ సెల్‌ఫోన్‌లతో అనుమతించరన్నారు. పరీక్షలకు హాజరయ్యే బాలికలను తనిఖీ చేయడానికి మహిళా టీచర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- మహిళకు ఇంటిపట్టా అందజేత

కడియం: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందజేయడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. లబ్ధిదారుకు ఆయన శుక్రవారం ఇంటిస్థలం పట్టా అందజేశారు. వివరాలు ఇలా.. దామిరెడ్డిపల్లికి చెందిన చింతల ధనలక్ష్మికి జేగురుపాడు పంచాయతీ పరిధిలోని పాములమెట్ట కాలనీలో స్థలం మంజూరైంది. అయితే సాంకేతిక కారణాలతో ఆమెకు స్థలాన్ని కేటాయించలేదు. దీంతో దామిరెడ్డిపల్లికి చెందిన పార్టీ నాయకులు ఈ సమస్యను చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పట్టా ఇప్పించారు. అలాగే ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కాగా.. ధనలక్ష్మి తల్లికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందింది. అలాగే ఆమెకు ఇంటి పట్టా కూడా అందింది. దీంతో ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాతపూడి రాంబాబు, నరమామిడి గణేశ్వరరావు, చింతపర్తి రాంబాబు, చిట్టిబాబు పాల్గొన్నారు.



ధనలక్ష్మికి స్థలం పట్టా అందజేస్తున్న కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

పలువురికి పరామర్శ

కడియం: వైఎస్సార్‌సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ శుక్రవారం కడియపుసావరం గ్రామానికి చెందిన పలువురిని పరామర్శించారు. పార్టీ నాయకుడు సాపిరెడ్డి కామేష్ తండ్రి రామారావు ఇటీవల ప్రమాదానికి గురై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సావరం సచివాలయ కన్వీనర్ గుత్తుల వెంకటరమణ తండ్రి విఘ్నేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి సీఎం జగన్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు గిరజాల వీర్రాజు

కడియం: రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కడియం విశాల సహకార పరపతి సంఘం చైర్మన్ గిరజాల వీర్రాజు (బాబు) అన్నారు. సంఘం మహాజన సభ శుక్రవారం స్థానిక సొసైటీ ఆవరణలో జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గిరజాల బాబు మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలా సీఎం జగన్ తోడ్పడుతున్నారన్నారు. కడియం సహకార సంఘం ద్వారా రైతుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ని అందుబాటులోకి తెచ్చామన్నారు. గత ఏడాది సంఘం జమాఖర్చులు, వచ్చే ఏడాది అంచనా బడ్జెట్‌ను పాలకవర్గం తీర్మానం ద్వారా ఆమోదించారు. సంఘం నుంచి అప్పులు పొందిన రైతులు నిర్ణీత సమయంలో చెల్లించి సంఘం పురోభివృద్ధికి సహకరించాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొమ్మిరెడ్డి వెంకట్రావు, సంఘ పాలకవర్గ సభ్యులు పంపన గోవిందు, వర్సాల వీర్రాజు, గిరజాల నాగేశ్వరరావు, శివాలయం చైర్మన్ ఆర్‌ఎస్ఎన్ మూర్తి, బండారు శ్రీనివాస్, కుసునూరి బాబులు, రైతు నాయకులు కొత్తూరి బాలనాగేశ్వరరావు, చిక్కాల శ్రీను, దొడ్డా బుజ్జి, బొమ్మిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.